బక్క రవీందర్
ఎడిటర్
సెల్: 8501919707



తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT

సంపుటి: 1 | సంచిక: 107 | పేజీలు: 4 | ఎడిటర్ : బక్క రవీందర్ | ప్రచురణ: హైదరాబాద్ | సోమవారం 25 -11-2024 | వెల: 5/రూ -


## నేడు ఢిల్లీకి సీఎం రేవంత్..

**ప్రజా విజయోత్సవాలపై అధిష్ఠానంతో చర్చ**

**మంత్రివర్గ విస్తరణపైనా.. తెలంగాణ తల్లి విగ్రహం**

**ఆవిష్కరణకు సోనియా, రాహుల్‌కు ఆహ్వానం**

హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారం చేపట్టి డిసెంబరు 7 నాటికి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ఏఐసీసీ పెద్దలను ఆయన కలవనున్నారు. ప్రజాపాలన విజయోత్సవాల గురించి తెలపడంతోపాటు ఢిల్లీ పెద్దలను ఈ ఉత్సవాలకు ఆహ్వానించనున్నట్టు తెలిసింది. అలాగే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీతోనూ రేవంత్ భేటీ కానున్నారు. అ?ధికారం చేపట్టి ఏడాది అవుతున్నా.. మంత్రివర్గంలో ఇంకా 6 స్థానాలు ఖాళీగానే ఉన్న నేపథ్యంలో క్యాబినెట్ విస్తరణపై రాహుల్‌తో చర్చించనున్నట్టు సమాచారం. ఇక సచివాలయంలో ఏర్పాటు చేయబోయే తెలంగాణ తల్లి విగ్రహాన్ని.. డిసెంబర్ 9న ఆవిష్కరించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఆ కార్యక్రమానికి సోనియా, రాహుల్‌ను ప్రత్యేకంగా ఆహ్వానించనున్నట్టు సమాచారం. ఇటు ఖాళీగా ఉన్న కొన్ని కార్పొరేషన్ పదవుల భర్తీతోపాటు 'కులగణన' పైనా అధిష్ఠానంతో చర్చించనున్నారు. ఇదిలాఉండగా.. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా కుటుంబ ఫంక్షన్‌లో సీఎం పాల్గొనున్నట్టు తెలిసింది.



## 28న హేమంత్ సొరేన్ ప్రమాణం

రాంచీ, నవంబర్ 24 : జార్ఖండ్ రాష్ట్ర తదుపరి ముఖ్యమంత్రిగా ప్రస్తుత సీఎం, జార?ండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) అధినేత హేమంత్ సొరేన్ మరోసారి బాధ్యతలు చేపట్టనున్నారు. ఇటీవల జార?ండ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమి తరఫున గెలిచిన ఎమ్మెల్యేలంతా ఆదివారం హేమంత్ సొరేన్ నివాసంలో సమావేశమై ఆయనను తమ శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం హేమంత్ సొరేన్ రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ సంతోష్ కుమార్ గంగ్వార్‌ను కలిశారు. ఇండియా కూటమి ఎమ్మెల్యేల మద్దతు లేఖను ఆయనకు సమర్పించి,

2లో


## సుప్పినీ... సుద్దపూస అంటూ జగన్‌కు 5 పాయింట్లతో కౌంటర్ ఇచ్చిన మంత్రి నారా లోకేశ్

- కూటమి ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందన్న జగన్
- మూడు విడతల ఫీజు రీఎంబర్స్ మెంట్ చేయలేదని ఆరోపణ
- చెత్త పాలన మీది అంటూ ఏకిపారేసిన నారా లోకేశ్
- నా నెత్తిన రూ.6,500 కోట్ల బకాయిలు పెట్టారంటూ ఆగ్రహం



చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని, మూడు విడతల ఫీజు రీఎంబర్స్ మెంట్

(మిగతా 2వ పేజీలో)



## 9 రోజుల వేడుక

**డిసెంబరు 1 నుంచి 9 వరకు రాష్ట్రమంతా ప్రజాపాలన విజయోత్సవాలు**

- ఏడాది పాలన సందర్భంగా సర్కారు సంబరాలు
- పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు
- పెద్దపల్లిలో యువతతో సీఎం రేవంత్‌రెడ్డి సభ
- గ్రూప్-4 అభ్యర్థులకు నియామక పత్రాలు
- 26 నియోజకవర్గాల్లో గురుకులాలకు శ్రీకారం
- గోషామహల్లో ఉస్మానియా ఆస్పత్రికి భూమిపూజ
- కేబీఆర్ పార్కు చుట్టూ కూడళ్ల అభివృద్ధికీ..
- దామరచర్లలో విద్యుత్తు కేంద్రం ప్రారంభం

హైదరాబాద్, నవంబరు 24 : రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు కొలువుదీరి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా తొమ్మిది రోజుల పాటు ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ వ్యాప్తంగా డిసెంబరు 1 నుంచి 9 వరకు ఘనంగా వేడుకలను నిర్వహించేందుకు సన్నద్ధమవుతోంది. ఉత్సవాల్లో భాగంగా కీలకమైన పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. 9 రోజుల పాటు జరిగే సంబరాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే కీలక భూమికగా ఉండేలా కార్యాచరణను రూపొందిస్తోంది. ఈ మేరకు శాఖలవారీగా ఒకటో తేదీ నుంచి వరుసగా నిర్వహించే కార్యక్రమాల ప్రణాళికను అధికారులు

(మిగతా 2వ పేజీలో)

## వికసిత భారత్‌లో యువత పాత్ర కీలకం: ప్రధాని మోదీ





## 3న కృష్ణా బోర్డు భేటీ

**::: 24 కీలక అంశాలపై చర్చ**



## నేడు కొలువుదీరనున్న 'మహా' సర్కారు?

- సీఎం ఎవరనేదానిపై సస్పెన్స్.. ఇద్దరికి ఉప ముఖ్యమంత్రి పదవి
- మంత్రులుగా తొలుత ఏడుగురే!.. కూటమిలో పదవుల పంపిణీ
- బీజేపీకి 22-24, సేనకు 10-12.. అజిత్ వర్గానికి 8-10!

## ధర్మబద్ధమైన విజ్ఞానం కావాలి

**ధర్మంతోనే అస్తిత్వం ఏకత్వ భావన అవసరం.. ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్**

**కొన్ని శక్తులు అభివృద్ధిని చూసి తట్టుకోలేకపోతున్నాయి: కిషన్‌రెడ్డి**

**ముగిసిన లోక్‌మంథన్ భాగ్యనగర్**



హైదరాబాద్, నవంబరు 24 : సమాజానికి ధర్మబద్ధమైన విజ్ఞానం ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆరెస్సెస్ సర్‌సంఘచాలక్ మోహన్ భాగవత్ అన్నారు. భారతదేశంలో ధర్మం విజ్ఞానభరితమైందని, మరి విజ్ఞానం ధర్మసమ్మతమా, కాదా అని ఆలోచించాలని సూచించారు. ఆదివారం శిల్పకళా వేదికలో 'లోక్‌మంథన్ భాగ్యనగర్ 2024' ముగింపు కార్యక్రమంలో భాగవత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకం, సృష్టి, ధర్మం సనాతనమని, ఇవి కలిసే నడుస్తాయని, ప్రళయం వరకు ఉంటాయన్నారు. ఇవి కలిసి ఉంటేనే అస్తిత్వం కొనసాగుతుందన్నారు. ఏకత్వ భావన వుంటే అంతా మనదేనన్న భావన వస్తుందని చెప్పారు. మనం ధర్మం పేరుతో చాలా అధర్మాలు చేశామని, స్వార్థం పెరిగిపోయిందని, అందుకే దుర్బలులుగా మారిపోయామన్నారు. మనం సమాజాన్ని మనం సరిచేసే ప్రక్రియ కొనసాగకపోవడం వల్లే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని తెలిపారు. శాస్త్రవేత్తలు ఇప్పటి వరకు కణాలు, జడత్వమని మాట్లాడారని, ఇప్పుడు చైతన్యమని అంటున్నారని భాగవత్ పేర్కొన్నారు. కానీ చైతన్యం అన్న అనుభూతి భారతీయుల వద్ద ఎప్పటి నుంచో ఉందని చెప్పారు. దీన్ని మరిచిపోయామని, ఈ విస్మృతి నుంచి బయటపడాలని సూచించారు. అడవుల్లో ఉండే వనవాసీలు వాటికి ధర్మకర్తలని, వాటిని సంరక్షిస్తారని, ధర్మంగా వ్యవహరిస్తారని కొనియాడారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ మనదేశంలో వనవాసీల పట్ల పురాతనకాలం నుంచీ వివక్ష లేదన్నారు. తమిళనాడులో కొన్ని సుబ్రహ్మణ్యస్వామి క్షేత్రాల్లో వనవాసీలు భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తారని చెప్పారు. వనవాసీ, గ్రామవాసీ, నగరవాసీ అని అంటున్నా, మన మనసుల్లో మాత్రం

(మిగతా 2వ పేజీలో)



## 21.73 ఎల్ఎంటీల ధాన్యం కొనుగోలు

**మంత్రి ఉత్తమ్ వెల్లడి**

**రైతులకు రూ.2,760.22 కోట్లు చెల్లింపు**

**రైతులుతొందరపడి దళారులకు అమ్ముకోవద్దు**

నల్లగొండ: గత సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 20.6 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటీ) ధాన్యం కొనుగోలు చేయగా, ఈ వానాకాలం సీజన్‌కు సంబంధించి ఇప్పటికే 21.73 ఎల్ఎంటీల ధాన్యం కొనుగోలు చేసినట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ధాన్యం కొనుగోళ్లు వేగంగా జరుగుతున్నాయని

(మిగతా 2వ పేజీలో)

# 9 రోజుల వేడుక



సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో సమీకృత గురుకుల పాఠశాల సముదాయాల భవనాలకు భూమి పూజ నిర్వహిస్తారు. ఇప్పటికే 28 నియోజకవర్గాల్లో ఈ భవనాల పనులు మొదలయ్యాయి. మరో 26 నియోజకవర్గాల పరిధిలో సమీకృత గురుకులాలలను ప్రభుత్వం ఇటీవలే మంజూరు చేసింది. ప్రజాపాలన విజయోత్సవాల్లో వీటికి శంకుస్థాపన చేయనున్నారు. ఒకటో తేదీ నుంచి 7 వరకు అన్ని గ్రామాల్లో సీఎం కప్ క్రీడా పోటీలను నిర్వహిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభను వెలుగులోకి తేవడమే లక్ష్యంగా స్పోర్ట్స్ అథారిటీ గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఈ పోటీలను నిర్వహిస్తుంది. డిసెంబరు 4న పెద్దపల్లిలో యువతతో విజయోత్సవ సభ నిర్వహించనున్నారు. గ్రూప్-4 ఉద్యోగాలు సాధించిన వారికి ఈ సభలో నియామకపత్రాలను అందజేయనున్నారు. వైద్య ఆరోగ్య శాఖపరిధిలో 16 కొత్త నర్సింగ్ కాలేజీలతో పాటు, 28 పారా మెడికల్ కాలేజీలను నెలకొల్పనున్నారు. వీటితో పాటు కొత్తగా 213 అంబులెన్స్‌లను అందుబాటులోకి తీసుకువస్తారు. ట్రాన్స్‌జెండర్లకు వైద్య సేవలు అందించేందుకు జిల్లాకో ట్రాన్స్‌జెండర్ క్లినిక్‌లను ఏర్పాటు చేయనున్నారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు వీరిని వాలంటీర్లుగా నియమిస్తారు. అలాగే గోషామహల్‌లో నిర్మించనున్న ఉస్మానియా ఆసుపత్రి కొత్త భవనానికి భూమి పూజ చేస్తారు. ఆరంఘర్%-%జూపార్క్ ఫ్లై ఓవర్‌ను ప్రారంభించనున్నారు. ఇటీవల నిర్మాణం పూర్తయిన ఆరు మురుగునీటి శుద్ధి ప్లాంట్లను ప్రారంభిస్తారు. కేబీఆర్ పార్కు సమీపంలో ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లతో ఆరు జంక్షన్లను అభివృద్ధి చేసేందుకు రూ.826 కోట్ల భారీ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నారు. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదిక సమీపంలో దాదాపు 106 స్టాళ్లతో ఇందిరా శక్తి మహిళా బజార్లను ప్రారంభిస్తారు. తెలంగాణ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ భవనానికి శంకుస్థాపనతో పాటు అటవీ పర్యాటక శాఖల ఆధ్వర్యంలో సఫారీ థీమ్ పార్క్, బొటానికల్ గార్డెన్లను ప్రారంభిస్తారు. ఘట్‌కేసర్‌లో బాలికలకు ప్రభుత్వ ఐటీఐ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తారు. ఇప్పటికే పనులు జరుగుతున్న మల్లేపల్లి, మేడ్చల్, నల్లగొండ ఏటీసీలను ప్రారంభిస్తారు. దామరచర్లలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో 800 మెగావాట్ల యూనిట్‌ను జాతికి అంకితం చేస్తారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 237 సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో తరగతులను ప్రారంభిస్తారు. కొత్తగా తలపెట్టిన స్పోర్ట్ యూనివర్సిటీకి భూమి పూజ చేస్తారు. ఐటీ, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఏఐ సిటీ ఏర్పాట్లతో పాటు పలు ఒప్పందాలు చేసుకోనున్నారు. విజయోత్సవాల సందర్భంగా రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు, కాలేజీల్లో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారు. అన్ని స్థాయిల్లోని విద్యార్థులను ఈ వేడుకల్లో భాగస్వామ్యం చేసేలా విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. శాఖల వారీగా నిర్ణీత ప్రణాళిక ప్రకారం సంబంధిత మంత్రుల సారథ్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆయా జిల్లాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు.. మంత్రులతో పాటు ఈ కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలని అధికారులకు సీఎం పిలుపునిచ్చారు.

# నేడు కొలువుదీరనున్న 'మహా' సర్కారు?

### సీఎం ఎవరనేదానిపై సస్పెన్స్.. ఇద్దరికి ఉప ముఖ్యమంత్రి పదవి

### మంత్రులుగా తొలుత ఏడుగురే!.. కూటమిలో పదవుల పంపిణీ

### బీజేపీకి 22-24, సేనకు 10-12.. అజిత్ వర్గానికి 8-10!



ముంబై, నవంబరు 24: మహారాష్ట్రలో మహాయుతి ప్రభుత్వం సోమవారం కొలువుదీరనుంది..! ప్రస్తుత శాసనసభ కాలపరిమితి మంగళవారంతో ముగియనుంది. దాంతో సోమవారమే కొత్త సర్కారును ఏర్పాటు చేయడం అనివార్యమైంది. ముఖ్యమంత్రి, ఇద్దరు ఉప ముఖ్యమంత్రులు, ఆరు లేదా ఏడుగురు మంత్రులు ప్రమాణం చేయవచ్చని తెలుస్తోంది. తదుపరి విస్తరణలో.. బీజేపీకి చెందిన 22-24 మంది ఎమ్మెల్యేలకు చోటుదక్కుతుందని సమాచారం. శిందే వర్గానికి 10-12, అజిత్ వర్గానికి 8-10 మంత్రి పదవులు దక్కుతాయని తెలుస్తోంది.

**కౌన్ బనేగా సీఎం?**

కొత్త ముఖ్యమంత్రి ఎవరనేదానిపైనా మహాయుతి కూటమిలో చర్చలు, సంప్రదింపులు కొనసాగుతున్నాయి. సొంతంగానే అత్యధిక స్థానాలు సాధించి, అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించిన బీజేపీ, తమ పార్టీ నాయకుడు, ఇప్పటి వరకు ఉపముఖ్యమంత్రిగా ఉన్న దేవంద్ర ఫడణవీస్ వైపే మొగ్గుచూపుతోంది. అదే సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే పనితీరును బీజేపీ పెద్దలు ప్రశంసిస్తున్నారు. మరోవైపు.. శివసేన(శిందేవర్గం) నాయకులు శిందేకు.. ఎన్సీపీ (అజిత్‌వర్గం) నేతలు అజిత్‌పవార్‌కు సీఎం పదవి ఇవ్వాలని కోరుతున్నారు. అయితే.. సీఎంగా ఎవరిని నియమించాలనేదానిపై సంప్రదింపుల వేదిక ఇప్పుడు ముంబై నుంచి ఢిల్లీకి మారింది. కూటమి అగ్రనేతలు ఢిల్లీకి పయనమయ్యారు. సోమవారం ఉదయానికల్లా నిర్ణయాన్ని ప్రకటించే అవకాశాలున్నాయి. ఫడణవీసకు న్యాయంగా సీఎం పీఠం దక్కాలని ఆరెస్సెస్ అభిప్రాయపడుతోంది. మహారాష్ట్ర ప్రజలు ఇంత భారీ మెజారిటీని కట్టబెట్టిన నేపథ్యంలో.. బీజేపీ సొంత పార్టీ నేతకే సీఎం పగ్గాలు అప్పగించడం సబబనే సందేశాన్ని పరోక్షంగా బీజేపీ అగ్రనాయకులకు పంపినట్లు విశ్వసనీయవర్గాలు చెబుతున్నాయి. అయితే కులపరమైన సమీకరణలు ఫడణవీస్ అభ్యర్థిత్వానికి ప్రతికూలతలుగా పరిణమించవచ్చని తెలుస్తోంది. మహారాష్ట్రలో ప్రాబల్యం అధికంగా ఉన్న మరాఠాలు తమ వర్గానికే ముఖ్యమంత్రి పదవిని ఇవ్వాలనే డిమాండ్‌ను గట్టిగా వినిపిస్తున్నారు. కాదని.. బీజేపీ అధినాయకత్వం ఫడణవీస్ వైపు మొగ్గుచూపితే.. ఇంతకాలం సీఎంగా ఉన్న శిందే ఆయన వద్ద ఉపముఖ్యమంత్రిగా పనిచేసేందుకు సునాయాసంగా అంగీకరిస్తారా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న.

# సుప్పినీ... సుద్దపూస అంటూ జగన్‌కు 5 పాయింట్లతో కౌంటర్ ఇచ్చిన మంత్రి నారా లోకేశ్

చేయకపోవడంతో విద్యార్థులు చదువు మానుకోవాల్సి వస్తోందని వైసీపీ అధినేత జగన్ సోషల్ మీడియాలో ధ్వజమెత్తడం తెలిసిందే. దీనిపై ఏపీ విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ అంశాల వారీగా ఐదు పాయింట్లతో బదులిచ్చారు.

1. చిన్న పిల్లల చిక్కీ డబ్బులు సైతం ఎగ్గొట్టిన సుప్పిని తాను సుద్దపూసని అనడం విచిత్రంగా ఉంది జగన్ గారు! గుడ్లు, చిక్కీలు మొదలుకొని ఫీజు రీఎంబర్స్ మెంట్ బకాయిల వరకూ మీరు నా నెత్తిన పెట్టి పోయిన బకాయిలు అక్షరాలా రూ. 6,500 కోట్లు. ఫీజు మొత్తం కడతానని చేతులెత్తేసిన చెత్త పాలన మీది. ఫీజు రీఎంబర్స్ మెంట్ పథకాన్ని మార్చి విద్యార్థుల భవిష్యత్తుతో ఫుట్ బాల్ ఆడుకుంది మీరు.

2. అధికారంలో ఉన్నప్పుడు బాధ్యతారాహిత్యంగా ఉండి ప్రతిపక్షంలోకి రాగానే విలువలు వల్లించడం మీకే చెల్లింది సుప్పిని జగన్ గారు. విద్యాదీవెన, వసతి దీవెన పేరుతో రూ.3,500 కోట్లు బకాయిలు పెట్టి మోసం చేసిన కారణంగానే సర్టిఫికెట్లు రాక లక్షలమంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది.

నేను యువగళం పాదయాత్ర చేసేటప్పుడే మీ నిర్వాకాన్ని విద్యార్థులు నా దృష్టికి తెచ్చారు. వారికి ఇచ్చిన హామీ మేరకు ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకొని సమస్య పరిష్కరించాం. గత ప్రభుత్వ బకాయిలను విడతలవారీగా చెల్లిస్తామని, విద్యార్థుల సర్టిఫికెట్లను తక్షణమే అందజేయాల్సిందిగా కళాశాలలను ఆదేశించాం. ఇకపై ఫీజు రీయింబర్స్ మెంట్ సొమ్మును నేరుగా కళాశాలలకు చెల్లించేలా ఇటీవలే నిర్ణయం కూడా తీసుకున్నాం.

3. అర్ధరాత్రి ఆత్మలతో మాట్లాడి ఉదయం నిర్ణయాలు తీసుకుని గత ఐదేళ్లలో విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించారు. మీ అనాలోచిత, అవినీతి విధానాల కారణంగా గత ఐదేళ్లలో రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లలో 4 లక్షలమంది విద్యార్థులు తగ్గిపోయిన విషయం వాస్తవం కాదా?

ఉపాధ్యాయులు, విద్యార్థులను సిద్ధంగా చెయ్యకుండానే సిబిఎస్ఈ పరీక్షా విధానం తీసుకొచ్చారు. మేం అధికారంలోకి వచ్చాక సీబీఎస్ఈ పరీక్షా విధానంలో నిర్వహించిన పరీక్షల్లో 90శాతం మంది ఫెయిలయ్యారు. నీ నిర్ణయాలు బ్లైండ్‌గా ఫాలో అయితే ఆ పిల్లలు అంతా బోర్డు పరీక్షల్లో తప్పి డిప్రెషన్లోకి వెళ్లేవారు.

ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యం పెంచకుండా, టోఫెల్, ఐబీ శిక్షణ ఇచ్చేవారు లేకపోయినా అమలు చేసామని డబ్బా కొట్టుకోవడం. ఇలా ఒక్కటేంటి విద్యా వ్యవస్థను నాశనం చేసిన పాపం మీదే జగన్ గారు.

4. నాడు – నేడు అంటూ పబ్లిసిటీ పీక్‌కు తీసుకెళ్లారు కానీ విషయం వీక్ అని తేలింది. నా క్షేత్రస్థాయి పర్యటనల్లో కనీసం పిల్లలు కూర్చోడానికి బల్లలు, తాగునీరు, టాయ్ లెట్లు లేని పాఠశాలలు దర్శనమిస్తున్నాయి. ఇక ట్యాబులు ఇంటికి ఇవ్వడం వలన జరుగుతున్న అనర్థాలను మీరు నేరుగా తల్లితండ్రులను అడిగి తెలుకోవచ్చు. అందుకే మేము స్కూళ్లలోనే పిల్లల సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం.

5. రాష్ట్రంలో గత ఐదేళ్లలో మీ వల్ల భ్రష్టు పట్టిన విద్యారంగాన్ని గాడిన పెట్టడం మా బాధ్యత. మీరు చేసిన విధ్వంసాన్ని ఒక్కొక్కటిగా సరిచేస్తూ ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాం. పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నాం.

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలను మెరుగుపర్చేందుకు ఖాళీగా ఉన్న 16,347 టీచర్ పోస్టులను మెగా డీఎస్సీతో భర్తీచేసే ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించాం. విద్యార్థులు, తల్లిదండ్రులకు ఇబ్బంది లేకుండా విద్యాదీవెన, వసతిదీవెన స్థానంలో పాత ఫీజు రీఎంబర్స్ మెంట్ పథకాన్ని అమలు చేసి తీరుతాం. లేనిది ఉన్నట్లు, ఉన్నది లేనట్లు భ్రమింపజేసే కనికట్టు విద్యలో మాస్టర్స్ చేసిన మీకు విద్యారంగంలో మేం చేస్తున్న మంచిపనులు కన్పించకపోవచ్చు. ఎవరేమనుకున్నా రాబోయే ఐదేళ్లలో ఏపీ విద్యారంగాన్ని దేశానికే తలమానికంగా తీర్చిదిద్దాలని చంద్రబాబుగారి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం సంకల్పించింది. మీలాంటి మారీచులు ఎంత తప్పుడు ప్రచారం చేసినా విద్యారంగ సంస్కరణల విషయంలో మా అడుగు ముందుకే!

# 21.73 ఎల్‌ఎంటీల ధాన్యం కొనుగోలు

ఇప్పటివరకు రూ.5,040.01 కోట్ల విలువైన వడ్లు కొనుగోలు చేశామని చెప్పారు. ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్లు, పౌర సరఫరాల అధికారులతో ఆయన సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నుంచి ఆదివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటివరకు దాదాపు 8 వేల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని తెలిపారు. గతంలో కంటే 2,447 కేంద్రాలను అధికంగా ప్రారంభించామన్నారు. మొత్తం 16.06 ఎల్‌ఎంటీల దొడ్డు, 5.67 ఎల్‌ఎంటీల సన్నాలు కొనుగోలు చేసినట్లు చెప్పారు. సన్నాలకు సంబంధించి రూ.283.25 కోట్ల బోనస్ ఇవ్వాల్సి ఉండగా.. రూ.8.17 కోట్లు చెల్లించామని తెలిపారు. చెల్లింపుల్లో గత ప్రభుత్వం కంటే ముందంజలో ఉన్నామని మంత్రి చెప్పారు. గత ప్రభుత్వంలో వానాకాలం సీజన్‌లో రూ.2,414.23 కోట్లు చెల్లిస్తే.. ప్రస్తుత సీజన్‌లో ఇప్పటివరకు తాము రూ.2,760.22 కోట్లు చెల్లించామన్నారు.

**రికార్డు స్థాయిలో దిగుబడి**

ఉమ్మడి ఏపీలో కూడా రాని దిగుబడి ఈ సారి తెలంగాణలో వచ్చిందని ఉత్తమ్‌చెప్పారు. 66.07 లక్షల ఎకరాల్లో 40 లక్షల మంది రైతులు 153 ఎల్‌ఎంటీల ధాన్యాన్ని పండించారని, ఇది భారతదేశంలోనే రికార్డు సృష్టిస్తుందని అన్నారు. కాళేశ్వరం కింద మూడు బరాజ్‌లు పని చేయకున్నా.. రికార్డు స్థాయిలో ఉత్పత్తి రావడానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలే కారణమన్నారు. చివరి గింజ వరకు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, జనవరి 10వ తేదీ వరకు కొనుగోళ్లు సాగుతాయని మంత్రి చెప్పారు. రైతులు తొందరపడి దళారులకు అమ్ముకోవద్దని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి మూడు రోజుల వ్యవధిలోనే ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తుందన్నారు.



# ఘనంగా కాసాల బుచ్చిరెడ్డి జన్మదిన వేడుకలు

సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 24: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ సి డీ సి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి జన్మదిన వేడుకలను సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పాల్గొని , శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జన్మదిన వేడుకల్లో విజేందర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ కొండల్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, చింత సాయినాథ్, కౌన్సిలర్ రామప్ప , జీవీ శ్రీనివాస్, విఠల్ ,విష్ణు , మాసుద్, రామగౌడ్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు...



# 3న కృష్ణా బోర్డు భేటీ

### ::: 24 కీలక అంశాలపై చర్చ

అమరావతి: ప్రస్తుత నీటి సంవత్సరంలో కృష్ణా జలాల పంపకాలే ప్రధాన అజెండాగా డిసెంబర్ 3వ తేదీన కృష్ణా బోర్డు సమావేశం కానుంది. చైర్మన్ అతుల్‌జైన్ అధ్యక్షతన హైదరాబాద్‌లోని జలసౌధలో జరిగే 19వ సర్వసభ్య సమావేశం అజెండాలో 24 కీలక అంశాలను కృష్ణా బోర్డు చేర్చింది. ఈ సమావేశంలో బోర్డు సభ్య కార్యదర్శితో పాటు రెండు రాష్ట్రాల జలవనరుల శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ఈఎన్‌సీలు పాల్గొననున్నారు. ఉమ్మడి ప్రాజెక్టుల్లోని కృష్ణా జలాలను 66 శాతం ఏపీ, 34 శాతం తెలంగాణ వాడుకునేలా గతంలో కృష్ణా బోర్డు సమావేశంలో రెండు రాష్ట్రాలు అంగీకరించాయి. కానీ.. తెలంగాణ ప్రభుత్వం 50 శాతం వాటా కావాలని కోరడం, దీన్ని ఏపీ ప్రభుత్వం వ్యతిరేకించడంతో ఈ అంశాన్ని అపెక్స్ కౌన్సిల్‌కు కృష్ణా బోర్డు సిఫార్సు చేసింది. నీటి పంపకాల జోలికి అపెక్స్ కౌన్సిల్ వెళ్లదని కేంద్ర జల్ శక్తి శాఖ తేల్చిచెప్పడంతో వివాదం మళ్లీ కృష్ణా బోర్డు ముందుకు వచ్చింది.

# ధర్మబద్ధమైన విజ్ఞానం కావాలి

భారతీయులమే అన్న భావన ఎప్పటి నుంచో ఉందన్నారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, లోక్‌మంథన్ ఆహ్వాన సంఘం చైర్మన్ కిషన్‌రెడ్డి మాట్లాడుతూ దేశాన్ని విశ్వగురుగా నిలిపేందుకు కలిసికట్టుగా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని చెప్పారు. దేశంలో ఆధ్యాత్మికత పెంపొందడంతో పాటు అభివృద్ధిని కొన్ని శక్తులు సహించలేకపోతున్నాయన్నారు. అరాచకం సృష్టించే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రధాని మోదీ చేస్తున్న కృషికి అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ మాట్లాడుతూ దేశంలో కుటుంబ వ్యవస్థ కుప్పకూలుతున్న తరుణంలో లోక్‌మంథన్ వంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

# 28న హేమంత్ సొరేన్ ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)

తదుపరి ప్రభుత్వ ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేయడంతో నూతన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటూ హేమంత్ సొరేన్‌ను గవర్నర్ ఆహ్వానించారు. అంతకుముందు సీఎం పదవికి రాజీనామా చేసిన హేమంత్ సొరేన్.. ఈ నెల 28న నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అప్పటివరకు ఆయన ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగనున్నారు.

### వికసిత భారత్‌లో యువత పాత్ర కీలకం: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ ఈరోజు (ఆదివారం)తన రేడియో కార్యక్రమం 'మన్‌కీ బాత్'లో మాట్లాడారు. ప్రధాని నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఇది 116వ ఎపిసోడ్. ఈ సందర్భంగా ప్రధాని మోదీ వికసిక బారత్‌లో యువత పాత్ర కీలకమని అన్నారు. 'మన్ కీ బాత్' కార్యక్రమం ప్రారంభంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ .. మన్ కీ బాత్ అంటే దేశానికి సంబంధించిన సమిష్టి కృషి గురించి మాట్లాడటమన్నారు. దేశం సాధించిన విజయాలు ఇక్కడి ప్రజల శక్తితో ముడిపడివున్నాయన్నారు. తాను ప్రజలతో నేరుగా కమ్యూనికేట్ కావడానికి మన్ కీ బాత్ కార్యక్రమం కోసం ఎదురు చూస్తుంటానని, వీలైనన్ని ఎక్కువ సందేశాలను అందించడానికి తన వంతు ప్రయత్నం చేస్తున్నాని, ప్రజలు అందించే సూచనల కోసం ఎదురుచూస్తుంటానని అన్నారు. ఈరోజు(ఆదివారం) చాలా ప్రత్యేకమైన రోజని, ఈరోజు ఎన్‌సీసీడీ అని ప్రధాని గుర్తుచేశారు.

# 26 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు




శంకర్‌పల్లి మండల పరిధిలోని టంగటూరు ప్రాథమిక పాఠశాలలో ఆదివారం 1997-98 సంవత్సరంలో ఏడో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 26 సంవత్సరాల తర్వాత తిరిగి కలుసుకున్నారు. బాల్యంలో విడిపోయిన స్నేహితులు మళ్లీ కలుసుకున్నారు. కీర్తిశేషులు నారాయణ సార్ ని విద్యార్థులు స్మరించుకున్నారు. విద్య నేర్పిన గురువులను వారు ఘనంగా సన్మానించారు. తమ విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఉన్నారని తెలుసుకున్న ఉపాధ్యాయులు ఆనందించారు. పూర్వ విద్యార్థులు ఒకరినొకరు కలుసుకొని తమ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాండు, మల్లారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గుండాలరావు, విట్టల్, సురేందర్ పాల్గొన్నారు.

శంకర్‌పల్లి నవంబర్ 24:(డైలీ రిపోర్ట్)

# సామాజిక సమరసత ఆధ్వర్యంలో సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు



**శంకర్పల్లి నవంబర్ 24:(డైలీ రిపోర్ట్):** సామాజిక సమరసత ఆధ్వర్యంలో శంకరపల్లి మున్సిపాలిటీ పరిధిలోని డిఎంఆర్ గార్డెన్స్ లో కార్తీక మాసం పురస్కరించుకొని సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో 132 కుటుంబాలు, వివిధ గ్రామాల భక్తుల చేత పూజారులు పవన్ పంతులు పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి తెలంగాణ సామాజిక సమరసత కన్వీనర్ అప్పల ప్రసాద్ జి మాట్లాడుతూ కులాలక తీతంగా సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించడం జరిగిందని అన్నారు. ప్రతి కుటుంబంలో తమ పిల్లలకు భక్తి కథలు చెప్పాలి అని మాతృమూర్తులకు తెలియజేశారు.టీవీ సీరియల్ చూడడం మానేసి కుటుంబ బలోపేతం కోసం తల్లి తండ్రులు వారితో ప్రేమగా మసలు కోవాలని కోరారు. భారతీయ సంస్కృతి యొక్క గొప్పతనాన్ని తెలియజేస్తూ పిల్లల చేత మాతృదేవోభవ పితృదేవోభవ ఆచార్యదేవోభవ అతిథిదేవోభవ అని పలికించారు.కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత సామాజిక సమరసత రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్, ఇతర సభ్యులు సత్యనారాయణ, జిల్లా కన్వీనర్ దామోదర్ రెడ్డి, శంకర పల్లి సమరసత సభ్యులు కవ్వగూడెం శ్రీను, లక్మా రెడ్డి, నందు, %=ూూ% కార్యకర్తలు తీగుళ్ళ నర్సింలు, నరసింహ రెడ్డి, అచ్చిరెడ్డి, నాగిరెడ్డి, శ్రీపాల్ రెడ్డి, జయరాం రెడ్డి, మహేందర్ రెడ్డి,గోపాల్, అచ్చిరెడ్డి, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# బిజెపికి అఖండ మెజార్టీని అందించిన మహారాష్ట్ర ప్రజలకు భినందనలు

### శంకర్పల్లి మండల బిజెపి ఉపాధ్యక్షుడు బండమీది వెంకటయ్య



**శంకర్పల్లి, నవంబర్ 24:(డైలీ రిపోర్ట్):** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి కి అఖండ విజయాన్ని చేకూర్చి మళ్లీ అధికారాన్ని కట్టబెట్టినందుకు మహారాష్ట్ర ఓటరు దేవుళ్లకు , శంకర్పల్లి మండల బిజెపి ఉపాధ్యక్షుడు బండమీది వెంకటయ్య శిరసాష్టంగా నమస్కారములు తెలియజేశారు. వారు మాట్లాడుతూ దమ్మున్న మన ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వాన్ని బలపరిచినందుకు , దేశాభివృద్ధి ధ్యేయంగా పనిచేసినందుకు యావత్ దేశం గర్విస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలోని దేశద్రోహ ,కుహనా ,లౌకిక పార్టీలను చావు దెబ్బ కొట్టి తగిన గుణపాఠం నేర్పినందుకు మరోసారి మహారాష్ట్ర ప్రజలను మనసారా అభినందిస్తున్నాను అని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి కనీసం ప్రతిపక్ష హోదా దక్కకుండా మహారాష్ట్ర ప్రజలు తీర్పునిచ్చారు అని తెలిపారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య , హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రులు అందరూ కలిసి ప్రచారం నిర్వహించిన అన్ని ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ ఓటమి చెందారని తెలిపారు. నూతనంగా ఎన్నికైన శాసనసభ్యులు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోయే ముఖ్యమంత్రి, మంత్రులు ,అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే రోజులలో తెలంగాణలో కూడా బిజెపి ప్రభుత్వం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో భారతదేశం ఒక ఉన్నతమైన స్థితికి చేరుకుంటుందని, ప్రపంచంలోని దేశాలన్నిటికీ జవాబుదారీగా ఉంటుందని తెలిపారు.

# ప్రత్యేక ఓటర్ నమోదు లో అర్హులైన వారు ఓటరు గా నమోదు చేసుకోవాలి

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి

సంగారెడ్డి, అందోల్ ఆర్డిఓ కార్యాలయాలు తనిఖీ.

ప్రత్యేక ఓటర్ నమోదు పరిశీలన

సంగారెడ్డి కలెక్టరేట్లో రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో సమావేశం.

**సంగారెడ్డి, నవంబర్ 23, (డైలీ రిపోర్ట్):** పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నూతన ఓటర్ నమోదు, ఎమ్మెల్సీ ఓటర్ నమోదు వివరాలను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కు కలెక్టర్ క్రాంతి వల్లూరు వివరించారు.శనివారం సంగారెడ్డి జిల్లాలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి పర్యటించారు. జిల్లాలో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ నమోదు క్యాంపెనింగ్ లను సంగారెడ్డి, ఆందోల్ నియోజకవర్గాలలో పర్యటించి తెలుసుకున్నారు. సంగారెడ్డి, ఆందోల్ ఆర్డీవో కార్యాలయాలను సందర్శించి కార్యాలయాలలో నూతన ఓటరు నమోదు ను పరిశీలించారు. ఆన్లైన్ వేగవంతంగా చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సంగారెడ్డి తార డిగ్రీ కళాశాల లో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. స్థానిక బిఎల్ఓ లతో మాట్లాడి ఫారం 6, 7, 8 ఆన్లైన్, సాధారణ దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సంగారెడ్డి లోని స్ట్రాంగ్ రూమ్ లో భద్రపరిచిన ఈవీఎంలను పరిశీలించారు. సంగారెడ్డి సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో సమావేశం అయ్యారు. జిల్లాలో ఎస్ ఎస్ ఆర్ 2025 ఓటరు నమోదు వివరాలు, ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదు వివరాలు తదితర అంశాలను జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్నికల ప్రధాన అధికారికి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు జిల్లాలోని ఆర్డీవోలు పాల్గొన్నారు.






# శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో ప్రత్యేక పూజలు చేసిన ముంబై వాసులు

**శంకర్‌పల్లి: నవంబర్ 24: (డైలీ రిపోర్ట్):** శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో గల 11వ శతాబ్దంలో శ్రీరాముడు ప్రతిష్టించిన శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో ఆదివారం ముంబై వాసులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి, స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ చైర్మన్ గోపాల్ రెడ్డి, ముంబై వాసులు వీణసతీష్ షా దంపతులను స్వామి వారి శేష వస్త్రంతో సన్మానించి, స్వామి వారి చిత్రపటాన్ని బహుకరించారు. మరకత లింగాన్ని దర్శించుకోవడం గొప్ప అనుభూతిని ఇచ్చిందని, ఎంతో అదృష్టంగా భావిస్తున్నామని ముంబై వాసులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# శంకర్‌పల్లిలో కలగానే ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల

### ఉన్నత విద్యకు దూరమవుతున్న పేద విద్యార్థులు: తెలంగాణ రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం జనరల్ సెక్రెటరీ వడ్ల కృష్ణ



**శంకర్‌పల్లి నవంబర్ 24:(డైలీ రిపోర్ట్):** శంకర్‌పల్లి మండల పరిధిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేస్తామని పాలకులు ఇచ్చిన హామీ నేటికీ అమలుకు నోచుకోవడం లేదని తెలంగాణ రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం జనరల్ సెక్రెటరీ వడ్ల కృష్ణ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండల, మున్సిపాల్టీకి చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించలేని పరిస్థితి నెలకొంది. ఈ ప్రాంతంలో ఉన్న పెద్ద ఇంజనీరింగ్ కాలేజీల్లో వివిధ రాష్ట్రాల విద్యార్థులు వచ్చి చదువుకుంటుంటే. స్థానిక విద్యార్థులకు మాత్రం కనీసం ప్రభుత్వ జూనియర్ కళాశాల అందుబాటులో లేకపోవడం గమనార్హం. ప్రైవేటు కళాశాలల్లో ఫీజులు చెల్లించే స్తోమత లేక పేద విద్యార్థులు, ఆడపిల్లలు విద్యకు దూరమవుతున్నారు. మండల, మున్సిపల్ పరిధిలో ప్రతీ ఏటా ఎంతో మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాస్తున్నారు.జూనియర్ కాలేజీతో పాటు డిగ్రీ కళాశాల కూడా శంకర్‌పల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసే విధంగా చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య చొరవ తీసుకోవాలని, సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడాలని వడ్ల కృష్ణ కోరారు.

# డిసెంబర్ 11, 12 తేదీలలో జరిగే సిపిఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

### సిపిఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శిగా అల్లి దేవేందర్ ఎన్నిక



**చేవెళ్ల నవంబర్ 24:(డైలీ రిపోర్ట్):** సిపిఎం పార్టీ డివిజన్ స్థాయి ముఖ్య నాయకుల సమావేశం స్థానిక చేవెళ్ల మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో జరిగింది ఈ కార్యక్రమానికి లిముఖ్యఅతిథిగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి జగదీష్ హాజరై గత మహాసభ నుంచి ఇప్పటివరకు జరిగిన కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. చేవెళ్ల డివిజన్లో పార్టీ అభివృద్ధి గురించి పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాల గురించి వాటి పరిష్కారం గురించి డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో చర్చించడం జరిగింది. గత మహాసభ నుంచి పార్టీ చేవెళ్ల డివిజన్లో పార్టీ ప్రజా సంఘాలు ఏ రకంగా పనిచేస్తున్నాయి పేద ప్రజల సమస్యలపై నిరంతరం జరుగుతున్న పోరాటాలపై చర్చించడం జరిగింది ముఖ్యంగా ఇల్లు ,ఇళ్ల స్థలాల పోరాటాల పైన కార్మికుల సమస్యల పైన ఈ సమావేశంలో చర్చించడం జరిగింది. రాబోయే రోజులలో పేద ప్రజల సమస్యలపై నిర్విరామంగా అనేక ఉద్యమాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం చేవెళ్ల డివిజన్ కమిటీని ఎన్నుకున్నారు సిపిఎం చేవెళ్ల డివిజన్ కమిటీ కార్యదర్శిగా అల్లి దేవేందర్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు 8 మంది సభ్యులను డివిజన్ కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు ఈ కార్యక్రమంలో పార్టీ ,ప్రజాసంఘాల డివిజన్ నాయకులు ప్రవీణ్ కుమార్, ప్రభుదాస్,బేగరి అరుణ్ కుమార్, ఎర్రవల్లి శ్రీనివాస్, స్వామి గౌడ్, బేగరి తేజ ,పవన్ కుమార్ ,జంగయ్య,జుబేర్ ,మహేష్ సాయిబాబా తదితరులు పాల్గొన్నారు

# బ్రేకప్ వల్ల డిప్రెషన్‌లోకి వెళ్లిపోయా : రాశీఖన్నా

కెరీర్ ఆరంభంలో దక్షిణాదిలో ఓ వెలుగువెలిగింది పంజాబీ భామ రాశీఖన్నా. 'థాంక్యూ' సినిమా తర్వాత టాలీవుడ్‌లో కాస్త బ్రేక్ తీసుకున్న ఈ అమ్మడు ప్రస్తుతం 'తెలుసు కదా' అనే చిత్రంలో నటిస్తున్నది. హిందీలో ఆమె నటించిన 'ది సబర్మతీ రిపోర్ట్' చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకురానుంది. గుజరాత్ గోద్రా రైలు దహనం నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ సినిమా ప్రమోషన్‌లో తన వ్యక్తిగత జీవితం గురించి ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది రాశీఖన్నా. గతంలో తాను ప్రేమలో ఉన్నానని, అనుకోని కారణాల వల్ల బ్రేకప్ అయిందని తన విఫల ప్రేమను తలచుకొని భావోద్వేగానికి గురైంది. రాశీఖన్నా మాట్లాడుతూ 'నేను చాలా సున్నిత మనస్కురాలిని. కొన్నేళ్ల క్రిందట ఓ వ్యక్తిని గాఢంగా ప్రేమించాను. కానీ దురదృష్టవశాత్తు మేమిద్దరం విడిపోవాల్సి వచ్చింది. ఆ సమయంలో చాలా బాధపడ్డాను. కొన్ని నెలల పాటు డిప్రెషన్‌లోకి వెళ్లిపోయా. ఆ తర్వాత ధై ర్యాన్ని కూడగట్టుకొని కెరీర్ మీద దృష్టి పెట్టాను. నా శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యుల మద్దతు వల్ల ఆ క్లిష్ట పరిస్థితుల నుంచి బయటపడ్డా' అని చెప్పింది. అ యితే తనతో ప్రేమాయణం నడిపిన వ్యక్తి గురించి ఎలాంటి వివరాలను వెల్లడించలేదు రాశీఖన్నా. దాంతో సదరు వ్యక్తి ఎవరోనని అభిమానులు ఆరా తీస్తున్నారు. రంజన్ చందేల్ దర్శకత్వం వహించిన 'ది సబర్మతీ రిపోర్ట్' ఈ నెల 15న విడుదల కానుంది.



# కడపకు వెళ్లనున్న రాంచర్.. కారణమిదే..!

టాలీవుడ్ స్టార్ యాక్టర్ రాంచరణ్ ప్రస్తుతం గేమ్ ఛేంజర్ సినిమాతో ఫుల్ బిజీగా ఉన్నాడని తెలిసిందే. పొలిటికల్ థ్రిల్లర్ జోనర్‌లోస్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం 2025 జనవరి 10న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇప్పటికే ప్రమోషనల్ ప్లాన్‌తో ఫుల్ బిజీగా ఉంది గేమ్ ఛేంజర్ టీం. కాగా రాంచరణ్ ప్రఖ్యాతి గాంచిన ఏపీలోని కడప దర్గాను సందర్శించనున్నాడు. తాజా సమాచారం ప్రకారం నవంబర్ 18న జరుగనున్న 80వ దర్గా నేషనల్ ముషైరా ఘజల్ ఈవెంట్‌కు రాంచరణ్ ముఖ్యఅతిథిగా హాజరుకాబోతున్నాడు. ఈవెంట్‌కు సంబంధించిన పూర్తి వివరాలపై త్వరలోనే క్లారిటీ రానుందని టాక్. మరోవైపు రాంచరణ్ ఉప్పెన డైరెక్టర్ బుచ్చిబాబు సానతో చేయబోయే ఆర్‌సీ 16 షూటింగ్‌లో జాయిన్ కావాల్సి ఉంది. ఆర్‌సీ 16 మైసూర్ షెడ్యూల్‌కు సంబంధించిన కొత్త అప్‌డేట్ రావాల్సి ఉంది. గేమ్ ఛేంజర్‌లో బాలీవుడ్ భామ కియారా అద్వానీ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. రాజోలు సుందరి అంజలి, నవీన్ చంద్ర, సునీల్, శ్రీకాంత్, బాలీవుడ్ యాక్టర్ హ్యారీ జోష్, కోలీవుడ్ యాక్టర్లు ఎస్‌జే సూర్య, సముద్రఖని, కన్నడ నటుడు జయరామ్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు.ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు తెరకెక్కిస్తున్నారు. కార్తీక్ సుబ్బరాజు కథనందిస్తుండగా.. సాయిమాధవ్ బుర్రా డైలాగ్స్ సమకూరుస్తున్నారు. ఈ చిత్రానికి ఎస్ థమన్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.



# అమిర్‌ఖాన్‌ను కలవనున్న దిల్‌రాజ్

## భారీ ప్రాజెక్టుకు ప్లాన్



టాలీవుడ్ టాప్ ప్రొడ్యూసర్ దిల్ రాజు హిందీలో పలు సినిమాలు తెరకెక్కించాడని తెలిసిందే. అంతేకాదు ఇటీవలే బాలీవుడ్ స్టార్ హీరో అమీర్ ఖాన్‌ను కలిసి ఓ ప్రాజెక్ట్ చేసే విషయమై చర్చించినట్టు వార్తలు తెరపైకి వచ్చాయి. టాలీవుడ్ లీడింగ్ డైరెక్టర్ వంశీపైడిపల్లి ఈ సినిమాకు దర్శకత్వం వహించబోతున్నాడని ఇన్‌సైడ్ టాక్. కాగా వంశీపైడిపల్లి ఇటీవలే అమీర్ ఖాన్‌కు సినిమా లైన్‌ను వినిపించగా.. ఎక్జయిట్ అయిన అమీర్ ఖాన్ పూర్తి స్క్రిప్ట్‌తో రావాలని సూచించాడట. తాజాగా దీనికి సంబంధించిన ఆసక్తికర అప్‌డేట్ నెట్టింట వైరల్ అవుతోంది. వంశీపైడిపల్లి స్క్రిప్ట్ వర్క్ పూర్తి చేశాడని.. త్వరలోనే దిల్ రాజుతో కలిసి ముంబైలో అమీర్‌ఖాన్‌ను కలువబోతున్నాడని బీటౌన్ సర్కిల్‌తోపాటు టాలీవుడ్‌లో వార్త ఒకటి హల్ చల్ చేస్తోంది. ఒకవేళ ఈ ప్రాజెక్టు ఒకే అయితే మాత్రం దిల్ రాజు హెూం బ్యానర్‌లో వంశీపైడిపల్లి- అమీర్ ఖాన్ కాంబోలో రాబోయే భారీ డీల్ అని చెప్పక తప్పదు. మరి ఈ క్రేజీ ప్రాజెక్టుపై రాబోయే రోజుల్లో అధికారిక ప్రకటన ఏదైనా వస్తుందేమో చూడాలంటున్నారు సినీ జనాలు. ఇంతకీ దిల్ రాజు ఎలాంటి సినిమా ప్లాన్ చేశాడోనని ఇండస్ట్రీ సర్కిల్‌లో ఆసక్తికర చర్చ నడుస్తోంది.

# రౌడీ బాయ్.. శ్రీలీలతో భారీ కాంబినేషన్




రౌడీ బాయ్ 'విజయ్ దేవరకొండ' హీరోగా గౌతమ్ తిన్ననూరి తెరకెక్కిస్తున్న సినిమా 'వీడి12'. ఈ సినిమాలో యంగ్ బ్యూటీ శ్రీలీల హీరోయిన్ గా నటిస్తోంది. 2025 సమ్మర్‌లో రిలీజ్ కానున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతోంది. ఇప్పటికే రిలీజైన ఓ పోస్టర్‌లో విజయ్ దేవరకొండ లుక్ అందరిని తెగ ఆకట్టుకుంటుంది. ఈ క్రమంలోనే మూవీ టీమ్ అప్డేట్స్‌తో హైప్ క్రియేట్ చేయాలనీ భావిస్తోంది. అయితే ఈ చిత్ర మేకర్స్ చేసిన ప్లాన్‌కి మీ మైండ్ బ్లైండ్ కావాల్సిందే. ఇంతకీ ఈ మూవీ మేకర్స్ ఎం ప్లాన్ చేశారంటే.. ఈ సినిమా టైటిల్ కూడా ఇంకా రివీల్ కాకపోవడంతో మేకర్స్ టైటిల్ టీజర్‌ని విడుదల చేసేందుకు సిద్ధమయ్యారు. అయితే ఈ టీజర్‌కి గాడ్ ఆఫ్ మాసెస్ బాలకృషని వాయిస్ ఓవర్ ఇచ్చేందుకు సంప్రదించారట మేకర్స్. దీనికి ఆయన కూడా సానుకూలంగా స్పందించారట. దీంతో రౌడీ బాయ్ ప్లస్ గాడ్ ఆఫ్ మాసెస్ కాంబినేషన్‌లో టీజర్ ఊహించుకుంటేనే గూస్ బంప్స్ వస్తున్నాయి అంటున్నారు ఫ్యాన్స్. 'మళ్ళీ రావా', 'జెర్సీ' వంటి సినిమాలతో ఫీల్ గుడ్ ఎమోషనల్ సినిమాలు అందించిన గౌతమ్ తిన్ననూరి ఈ సారి యాక్షన్ జోనర్ లోకి షిఫ్ట్ అయ్యాడు. ఈ సినిమా పోస్టర్ చూస్తేనే తెలిసిపోతుంది. ఇక విజయ్ దేవరకొండ కూడా ఈ సినిమాపై ఫుల్ కాన్ఫిడెన్స్‌తో ఉన్నాడు. ఇది మంచి కంబ్యాక్ ఫిల్మ్ కాబోతుందని విశ్లేషకుల మాట. ఈ గ్యాప్‌లో గౌతమ్ మరో చిన్న ప్రాజెక్ట్ తో థియేటర్ల ముందుకి రానున్నాడు.



# పుష్ప.2 భారీ ప్రమోషనల్ ప్లాన్ రెడీ

టాలీవుడ్ స్టార్ యాక్టర్ అల్లు అర్జున్ కాంపౌండ్ నుంచి వస్తోన్న ఫ్రాంచైజీ ప్రాజెక్ట్ పుష్ప 2 ది రూల్. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో కన్నడ భామ రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తుండగా.. మలయాళ స్టార్ హీరో ఫహద్ ఫాసిల్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ మూవీని 2024 డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ఇప్పటికే మేకర్స్ ప్రకటించారని తెలిసిందే. ఈ నేపథ్యంలో భారీ ప్రమోషనల్ ప్లాన్ రెడీ చేశారు. ఈ నెల 17న పాట్నాలోని గాంధీ మైదాన్ సాయంత్రం 5 గంటల నుంచి పుష్ప ది రూల్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ కొత్త పోస్టర్ షేర్ చేశారు మేకర్స్. మొత్తానికి పుష్పరాజ్ మేనియా ఈ సారి గట్టిగానే ఉండబోతుందని తాజా పోస్టర్ చెప్పకనే చెబుతోంది. ఫస్ట్ పార్టుకు అదిరిపోయే బ్యాక్ గ్రౌండ్ స్కోర్, ఆల్బమ్ అందించిన రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ సీక్వెల్‌కు కూడా పనిచేస్తుండటంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. సీక్వెల్‌లో ఫహద్ ఫాసిల్, జగదీష్ ప్రతాప్ బండారి, జగపతిబాబు, ప్రకాశ్ రాజ్, సునీల్, అనసూయ భరద్వాజ్, రావు రమేశ్, ధనంజయ, షణ్ముఖ్, అజయ్, శ్రీతేజ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707